ప్రజాశక్తి

ఆదివారం 12 జనవరి 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

ద్వారకా కాంప్లెక్స్‌లో బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

కిటకిట

- సంక్రాంతి ప్రయాణాలతో ఆర్‌టిసి కాంప్లెక్స్, రైల్వే స్టేషన్‌లో విపరీత రద్దీ
- సెలవులు కలిసిరావడంతో సొంతూళ్లకు జనం పయనం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి ప్రయాణాలతో విశాఖలోని ద్వారకా బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ శనివారం కిటకిటలాడాయి. అటు తెలంగాణతో పాటు ఇటు మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి సొంత ఊర్లకు బస్సుల్లో వస్తున్న ప్రయాణికులు, విశాఖ నుంచి సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో విపరీత రద్దీ నెలకొంది. ఈ నెల 11 నుంచి 19 వరకు పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిన నేపథ్యంలో సంక్రాంతి ప్రయాణాలు శుక్రవారం మొదలై.. శనివారం ఊపందుకున్నాయి. ఆదివారం ప్రయాణికుల సంఖ్య మరింత అధికంగా ఉంటుందని ఆర్‌టిసి అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి ఆర్‌టిసి 174 బస్సులను ప్రత్యేకంగా నడుపుతోంది. ద్వారక బస్ స్టేషన్‌తోపాటు మద్దిలపాలెం బస్ స్టేషన్ నుంచి కూడా ప్రయాణాలు అధికంగా ఉన్నాయి. అంతేకాకుండా వివిధ రవాణా సాధనాల ద్వారా విశాఖ వచ్చినవారు చుట్టుపక్కలగల తమ స్వస్థలాలకు వెళ్లేందుకు ద్వారకా కాంప్లెక్స్‌నే ఆధారం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో టిక్కెట్లు జారీచేసే కౌంటర్ల వద్ద జనం మిగతా 2లో..

విశాఖ రైల్వే స్టేషన్‌లో జన రద్దీ

ప్రైవేటు దోపిడీ

- పండగ పేరిట టికెట్ ధరలను భారీగా పెంచిన ట్రావెల్స్ నిర్వాహకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సంక్రాంతి పండగ వస్తే సొంత ఊళ్లకు వెళ్లాలన్న తాపత్రయం చాలా మందికి ఉంటుంది. ఆర్‌టిసి, రైల్వే, విమాన టికెట్లు లభించకపోవడంతో చాలా మంది ఇప్పుడు ప్రైవేట్ బస్ సర్వీసులను ఆశ్రయిస్తున్నారు. దీనిని అదునుగా చేసుకుని ప్రైవేట్ బస్సుల యాజమాన్యాలు భారీగా రేట్లు పెంచి ప్రయాణికుల జేబులు ఖాళీ చేస్తున్నాయి. నగరంలో ఏటా ఈ తంతు జరుగుతున్నా అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ప్రయాణం తప్పనిసరి కావడంతో భారీ మొత్తాన్ని చెల్లించి ప్రైవేట్ బస్సుల్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. విశాఖ నగరంలో జరుగుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ దందాను ఓసారి పరిశీలిస్తే విస్మయం కలుగకమానదు.

ప్రైవేటు బస్సులకు డిమాండ్ పెరగడంతో వారం రోజుల కిందట ఉన్న ధరల కన్నా 50 నుంచి 100 శాతం వరకు టిక్కెట్ ధరలను పెంచేశారు. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి విశాఖకు అత్యధిక సంఖ్యలో ప్రయాణికులు వస్తూ ఉంటారు. దీంతో ఆయా మార్గాలలో ప్రయాణించే బస్సుల ఛార్జీలను గణనీయంగా పెంచేశారు. ఈ నెల ఒకటిన హైదరాబాద్ నుంచి విశాఖపట్నం రావాలంటే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో టికెట్ రూ.1500 నుంచి రూ.2000 వరకు ఉండేది. శనివారానికి ఆ టికెట్ రేట్లను పరిశీలిస్తే రూ.3,200 రూపాయలు వరకు పెరిగింది. 14వ తేదీకి టికెట్ తీసుకుందామని వెళ్లిన ప్రయాణికులకు ప్రైవేట్ బస్సుల యాజమాన్యం గట్టిగానే షాక్ ఇచ్చాయి. ఆ రోజు టిక్కెట్ ధరను రూ.5700 వరకు పెంచేశాయి. దీనిని బట్టి ప్రైవేటు ట్రావెల్స్ దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అటు నుంచి మిగతా 2లో..

చెరుకు రైతుల బకాయిలు చెల్లించాలి

▶ వార్త 5లో..

రంగురాళ్ల క్వారీలపై నిరంతర నిఘా

▶ వార్త 7లో..

విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఆకస్మిక తనిఖీలు

▶ వార్త 8లో..

సెయింట్ ఆన్స్ కళాశాలలో ఉత్సాహంగా సాగుతున్న ముగ్గుల పోటీలు

వైభవంగా సంక్రాంతి సంబరాలు

వాడవాడలా క్రీడా, ముగ్గుల పోటీలు వార్తలు 8లో..

స్టీల్‌ప్లాంట్‌లో విఆర్ఎస్ పేరిట

కార్మికుల తొలగింపునకు కుట్ర

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో విఆర్ఎస్ పేరుతో కార్మికులను తొలగించడానికి కుట్ర జరుగుతోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.జ్యోతీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాలుగేళ్లుగా కార్మికులు పెద్ద ఎత్తున పోరాడుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 8న విశాఖపట్నం పర్యటన సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటిస్తారని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తారని ఎంతో ఆశగా కార్మిక వర్గం ఎదురు చూసిందని తెలిపారు. లక్షలాది మంది పాల్గొన్నటువంటి ఈ సభలో స్టీల్ ప్లాంట్ కోసం ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కనీసం ప్రస్తావించకపోవడం

సిఐటియు

దుర్మార్గమని పేర్కొన్నారు. ఇప్పుడు విఆర్ఎస్ పేరుతో కార్మికులను తొలగించేందుకు పూనుకోవడం సరికాదన్నారు. ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకులను, నిధులను సమకూర్చకుండా కార్మికులను తొలగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. విఆర్ఎస్ నిర్ణయాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంఖ్యను తగ్గించి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు కంపెనీకి కట్టబెట్టాలని మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. ప్రధాని పర్యటన ముగిసిన వెంటనే విఆర్ఎస్ ప్రకటించడం, అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం సొంత గనులు కేటాయించాలని చంద్రబాబు కోరడం ఇవన్నీ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దెబ్బతీయడం కోసమేనని నిర్ధారణ అయ్యిందన్నారు. కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి వున్నా ప్లాంట్ రక్షణకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. అలా కాకుండా విఆర్ఎస్ పేరుతో కార్మికులను తగ్గించడం, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం తగదన్నారు.

నాలుగు సంవత్సరాలుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటాన్ని వృథాగా పోనివ్వరాదన్నారు. బిహెచ్‌పివిని ఎల్ అండ్ టికి అప్పుజెప్పాలని ఆనాడు కేంద్రంలో ఉన్న వాజ్‌పాయ్ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం ఈ విధంగానే కుట్రపన్నాయని తెలిపారు. నేడు అదే పద్ధతిలో స్టీల్‌ప్లాంట్ విషయంలో కుట్ర చేస్తున్నారన్నారు. బిహెచ్‌పివి కార్మికులు పోరాడి బిహెచ్‌పివిని బిహెచ్ఇఎల్‌లో విలీనం చేసుకున్నారని తెలిపారు. షిప్ యార్డ్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ప్రైవేటు దోపిడీ

వచ్చే ప్రయాణికులు మాత్రమే కాకుండా ఇటు విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే ప్రయాణికులకు కూడా ఇదే స్థాయిలో ఛార్జీల మోత మోగించారు. విజయవాడ వెళ్లేందుకు ఈ నెల 7వ తేదీ వరకూ ఎసి స్లీపర్ సీటు రూ.1200, నాన్ ఎసి స్లీపర్ సీటు రూ.900 ఉండగా, 16, 17 తేదీలలో ఎసి స్లీపర్ ధరను రూ.1500 నుంచి రూ.2500 వరకు పెంచారు. హైదరాబాద్ వెళ్లటానికి విశాఖ నుంచి ఈ నెల 7 వరకు ఎసి స్లీపర్ రూ.1500 నుంచి రూ.2000, నాన్ ఎసి రూ.1060 నుంచి రూ.1500 ఉండగా వీటి ధరలు 15, 16 తేదీలలో ఎసి స్లీపర్ రూ.3200 నుంచి రూ.5800 మధ్య పెరిగింది. బస్సుల కేటగిరీని దృష్టిలో ఉంచుకొని నాన్ ఎసి స్లీపర్ ధరను రూ.2500 నుంచి రూ.3200కు పెంచేశారు. అలాగే విజయవాడ నుంచి తిరుగు ప్రయాణాలు అధికంగా ఉంటాయి కాబట్టి 16, 17 తేదీలలో ఎసి స్లీపర్ టిక్కెట్ ధర రూ.1500 నుంచి రూ.2500 మధ్య ఉంది. నాన్ ఎసి స్లీపర్ రూ.1500, అదే నాన్ ఎసి చైర్ అయితే రూ 970 నుంచి రూ.1100 మధ్య ధర పలుకుతోంది. విశాఖ నుంచి నిత్యం విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ నగరాలకు 54 ట్రావెల్ సంస్థలకు చెందిన 110 బస్సులు వెళుతుంటాయి. పండగ సీజన్‌లో వీటి సంఖ్య కొంత వరకు పెరుగుతుంది. సంక్రాంతి పండగ రోజులలో వేర్వేరు ప్రదేశాల నుంచి ప్రతి రోజు మూడు వేల మంది నగరానికి వస్తారు. వీరంతా పండగ తర్వాత తిరుగు ప్రయాణాలు చేయాల్సి ఉంటుంది. వీరందరిపైనా టిక్కెట్ భారం పడుతుంది. ప్రైవేటు బస్సుల యాజమాన్యాల దందాను నియంత్రించాల్సిన బాధ్యత రవాణా శాఖ అధికారులపై ఉంది.

కార్మికుల తొలగింపునకు కుట్ర

కార్మికులు పోరాడి డిఫెన్స్‌లో విలీనం చేసుకున్నారన్నారు. డిసిఐని పోరాడి కాపాడుకున్నారని గుర్తుచేశారు. కచ్చితంగా పోరాటం ద్వారా స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్మికులు, ఉద్యోగులు, అధికారులు విఆర్ఎస్ పెట్టవద్దని, ఐక్యంగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.

న్యాయం చేయరూ..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తనను నిత్యం వేధిస్తున్న భార్య, ఆమె సోదరుని నుంచి రక్షించాలంటూ విఎంఆర్‌డిఎలో పనిచేస్తున్న అంధ ఉద్యోగి, మూర్ఛ రోగి ఎస్.శ్రీధర్ కోరారు. తన సమస్యలపై శనివారం డాబా గార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విఎంఆర్‌డిఎలోని తన ప్రభుత్వ ఉద్యోగం కోసం తన భార్య, ఆమె సోదరుడు మానసికంగా వేధించడమే కాకుండా చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. దారి కాసి భౌతిక దాడులు చేస్తున్నారని తెలిపారు. తన కుటుంబ సభ్యులపై తప్పుడు పోలీస్ కేసులు పెడుతున్నారని, అందువల్ల తనకు రక్షణ కల్పించాలని కోరారు.

కిటకిట

(మొదటి పేజీ తరువాయి..)

బారులు తీరి కనిపించారు. ప్రయాణికుల రద్దీని గుర్తించిన అధికారులు అదనంగా మూడు కౌంటర్లు ఏ ర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ టికెట్ల అమ్మకాలు జరిగే ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్, విజయవాడతో పాటు అమలాపురం, రాజమండ్రి, కాకినాడ, భీమవరంలకు, అలాగే శ్రీకాకుళం, విజయనగరం, నర్సీపట్నం వంటి ప్రాంతాలకు కూడా అదనపు బస్ సర్వీసులను కేటాయించినట్టు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి బి.అప్పలనాయుడు 'ప్రజాశక్తి'కి తెలిపారు. రైల్వే స్టేషన్‌కు వెళ్లే వారి కోసం, అక్కడ నుంచి నగరానికి వస్తున్న వారి కోసం ప్రత్యేక బస్సులను అదనంగా వేసినట్టు వెల్లడించారు.

బస్సు ఛార్జీల పెంపు లేదు

సాధారణంగా సంక్రాంతి వంటి పండగల సమయంలో బస్సు ప్రయాణ ఛార్జీలను పెంచడం అనవాయతీగా వస్తోంది. అయితే ఈసారి బస్ టికెట్ ఛార్జీలను పెంచలేదని, సాధారణ రోజుల్లో ఎంత టికెట్ ధర ఉంటే అంత మాత్రమే వసూలు చేస్తున్నామని ఆర్ఎం అప్పలనాయుడు తెలిపారు.

లగేజీలతో రైలు ఎక్కుతున్న జనం

రైల్వే స్టేషన్‌లో పరిస్థితి ఇలా..

సొంత ఊర్లకు వెళ్లే వారితో రైల్వే స్టేషన్ కూడా రద్దీగా మారింది. రెగ్యులర్‌గా నడిచే రైళ్లు కాకుండా, రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లు కూడా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. రైళ్లలో కూర్చోవడానికి సీట్లు పొందడం కోసం ప్రయాణికులు మధ్య తోపులాటలు, ఘర్షణలు జరుగుతున్నాయి. ఆర్‌పిఎఫ్ సిబ్బంది ప్రతి రైలు వద్ద ప్రత్యేకంగా ఉండి తోపులాటలు, ఘర్షణలను నివారించే చర్యలు చేపడుతున్నారు. ఇటు ఆర్‌టిసి బస్ కాంప్లెక్స్, అటు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫారాలపై ఉన్న దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా మారాయి. బస్ కాంప్లెక్స్‌లో తినుబండారాల ధరలను ఏ మాత్రమూ పెంచకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. రైల్వే స్టేషన్‌లో మాత్రం అటువంటి నిఘా లేకపోవడంతో అన్ని ఆహార దినుసులు, డ్రింక్స్ వగైరా వాటి ధరలు విపరీతంగా పెంచి వ్యాపారులు దోచుకుంటున్నారని పలువురు తెలిపారు.

విశాఖ నగరంలో ట్రాఫిక్ వలయంలో చిక్కుకున్న వాహనాలు

వంచన సభ..!

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కుక్కలు చెప్పులు, నక్కలు గోతులు వెతికినట్లు పాలక పార్టీలు సాధారణ ప్రజలను వంచించే క్రమంలో సాకులు చెబుతుంటాయి. తమకు కావాల్సిన సంపన్నుల ప్రయోజనాలకు అబద్ధాలు ఆడుతుంటాయి. మాటలు మారుస్తుంటాయి. వేషాలు వేస్తుంటాయి. నయ వంచనను కూడా నవోదయంగా చెప్పిన, చెప్పగలిగిన వంచన శిల్పులను చేతుల్లో పెట్టుకొని కొత్త ఆటలు ఆడుతుంటాయి. ఈ నెల 8న విశాఖలోని ఎయు మైదానంలో ప్రధాని నరేంద్ర మోడీతో తలపెట్టిన సభనే దీనికి ఉదాహరణ. ఆ సభ ఎంతో అద్భుతమంటూ కూటమి ప్రభుత్వం, అందులోని భాగస్వామి పార్టీలు జబ్బలు చరుచుకుంటున్నాయి. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేస్తామనిగానీ, సొంత గనులు కేటాయిస్తామనిగానీ, సెయిల్‌లో విలీనం చేస్తామనిగానీ ప్రధానితో ప్రకటించలేని తమ బలహీనతకు సిగ్గుతో తలవంచుకోవాల్సిన ప్రభుత్వాధినేతలు సభ జరగడమే పెద్ద విజయమన్న అనుభూతి పొందడం బాధాకరం. ఉత్తరాంధ్రకు అవమానకరం. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్న ఆలోచన ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులకు లేకపోవడం మరింత విషాదకరం. చేరదీసిన వ్యాపార వలస పక్షులకు (ఎంపీ, ఎమ్మెల్యేలకు) ఉత్తరాంధ్ర ప్రజలు బాగోగులు పట్టకపోయినా, ఈ నేలపై పుట్టి, పెరిగి, చట్టసభలకు వెళ్లిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ ప్రాంత ప్రయోజనాలు పట్టించుకోకపోవడం కంటే ఘోరం ఇంతకంటే ఏముంటుంది ?

స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీసే కుట్రలకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న సుదీర్ఘ పోరాటం తెలిసి కూడా వారి పక్షాన, స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నోరెత్తకపోవడం ఎన్నుకున్న ప్రజలను మోసగించడంకాదా?. ఏర్పాటుకాని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని ఢిల్లీలో ప్రధాని మోడీని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని అడగాలని చెప్పలేని నిస్సహాయ స్థితిలో మన ఎంపీలున్నారా ? పదవులు నిలబెట్టుకోవడం కోసం తమను ఎన్నుకున్న ఈ ప్రాంత ప్రజలను మోసగించదల్చుకున్నారా ?. తాను చెబితే ప్రధాని మోడీ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపేస్తారని ఎన్నికల వరకూ చెప్పుకుంటూ వచ్చిన జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇప్పుడు నోరు మెదపకపోవడం మోసం కాదా ?.

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు చేయొద్దని మత్స్యకారులు, ఆ ప్రాంత ప్రజలు పోరాడుతున్నారు. హెటిరో కాలుష్యంతో బతకలేకపోతున్న తమ ప్రాంతంలో కాలుష్య పరిశ్రమలు వద్దని ప్రధాని విశాఖ నుంచి బల్క్‌డ్రగ్ పార్కుకు చేయనున్న శంకుస్థాపనపై నిర్వాసిత గ్రామాల్లో ప్రజలు నిరసన తెలిపారు. వాస్తవానికి ఈ పార్కు ఏర్పాటు క్రమంలో పర్యావరణ నిబంధనలు పాటించలేదు. పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండానే బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేయడంపై పర్యావరణ నిపుణులు తీవ్ర అభ్యంతరం తెలుపుతున్నారు. ఈ ఉల్లంఘన తన నియోజకవర్గంలో జరుగుతున్నా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు పట్టడంలేదు. మత్స్యకారులు, ప్రజల బాధ వినిపించుకోవడంలేదు. గత వైసిపి ప్రభుత్వ దారిలోనే నేటి కూటమి సర్కారూ వెళ్తోంది. నాడు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు మోడీ ప్రభుత్వంపై వైసిపి ఒత్తిడి తేలేదు. ఇప్పుడు టిడిపి, జనసేన కూడా తేవడంలేదు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కార్మికవర్గం చేస్తున్న పోరాటానికి సిపిఎం, వామపక్షాలు అండగా ఉంటున్నాయి. ఈ ఉద్యమంలో ప్రజలు మరింత భాగస్వాములు కావాలి. ప్రత్యక్షంగా పాల్గొనాలి.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
O.S.713/2022

Between:
Sri Putla Ganga Bhavan Rao and 2 others ...Plaintiffs
And:
Sri Mulaguri Raghavendra Prasad and 3 others ...Defendants

SUMMONS

To,
D-4: Sri Kovvuri Satti Reddy,
S/o. Veer Reddy,
R/at D.No.9-6-6, Sivajipalem,
Visakhapatnam,
Andhra Pradesh-530017.

Whereas the above named plaintiffs filed the above suit against you for grant of permanent injunction in O.S.713/2022 on the file of the Hon'ble II Addl. Junior Civil Judge at Vizianagaram and the matter stands posted to **27-01-2025** for your appearance. Take notice that in the above proceedings you are hereby directed to appear before the Hon'ble II Addl. Junior Civil Judge, Vizianagaram on **27-01-2025** at **10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
R.V.K. NAIDU,
Advocate
Visakhapatnam
Cell: 9441595993.

IN THE HON'BLE COURT OF THE II ADDL. JUNIOR CIVIL JUDGE AT VIZIANAGARAM
I.A.695/2022 in O.S.713/2022

Between:
Sri Putla Ganga Bhavan Rao and 2 others ...Petitioners/Plaintiffs
And:
Sri Mulaguri Raghavendra Prasad and 3 others ...Respondents/Defendants

NOTICE

To,
R-4: Sri Kovvuri Satti Reddy,
S/o. Veer Reddy, R/at D.No.9-6-6,
Sivajipalem, Visakhapatnam,
Andhra Pradesh-530017.

Whereas the above named petitioners filed the above I.A. against you for grant of temporary injunction in I.A.695/2022 in O.S.713/2022 on the file of the Hon'ble II Addl. Junior Civil Judge at Vizianagaram and the matter stands posted to **27-01-2025** for your appearance. Take notice that in the above proceedings you are hereby directed to appear before the Hon'ble II Addl. Junior Civil Judge, Vizianagaram on **27-01-2025** at **10.30 A.M.** either in person or through an Advocate, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
R.V.K. NAIDU,
Advocate
Visakhapatnam
Cell: 9441595993.

BEFORE THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-I AT: VISAKHAPATNAM
C.C.271/2024

Between:
Miss. Sreemukhi Dandamudi, being minor is Rep. by her Mother Mrs. Harika Punnami Pinnamaneni ...Complainant
And:
1) Mr. Gopal Sarkar
2) Dr. Sonalika Gogia
3) M/s. L.V. Prasad Eye Institute GMRV Campus, Visakhapatnam ...Opposite Parties

NOTICE

To,
Opposite Party No.2:
Dr. Sonalika Gogia, Doctor, L.V.Prasad Eye Institute-GMRV Campus D.No.11-113/1, Hanumanthavaka Junction, Visakhapatnam.

Please take notice that the above named complainant has instituted the above complaint against you and the matter stands posted to **23-01-2025** for your appearance. You are hereby directed to appear before the Hon'ble District Consumer Disputes Redressal Commission-I at VUDA Complex, Siripuram, Visakhapatnam on **23-01-2025** at **10:30 A.M.**, either yourself in person or any person authorized by you, failing which the Hon'ble Commission will proceed with the matter as per law.

(By Order of the Hon'ble Commission-I)
K. RAMA KIREETI,
Advocate
14-37-16/1, Gokhale Road, Maharanipeta, Visakhapatnam-02.

కేంద్ర కారాగారం వద్ద పిడకల విక్రయాలు

ప్రజాశక్తి - ఆరిలోవ

విశాఖ కేంద్రకారాగారం ప్రధాన ద్వారం వద్ద ఉన్న సుధార్ వస్తు విక్రయ కేంద్రంలో ఆవు పేడతో తయారుచేసిన పిడకల దండలు ప్రత్యేక ఆకర్షణగా కనబడుతున్నాయి. కొనుగోలుదారులు వీటిని కొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. విశాఖ సెంట్రల్ జైలు వద్ద ఆవు పేడతో తయారుచేసిన పిడకలు అమ్మడం ఏంటని అనుకుంటున్నారా? అది నిజమే. కేంద్రకారాగారం మొదటి గేటు వద్ద బిఆర్‌టిఎస్ రోడ్డుకు ఆనుకొని కేంద్రకారాగారం ఆధ్వర్యాన సుధార్ వస్తు విక్రయ కేంద్రం ఏర్పాటు చేశారు. కేంద్రకారాగారంలో ఉన్న కుటీర పరిశ్రమలో ఖైదీలు తయారుచేసిన వస్తువులను ఈ స్వధార్ వస్తు కేంద్రంలో ఉంచి విక్రయిస్తుంటారు. వీటిని బయటవారు కొనుక్కోవచ్చు. ఖైదీలు తయారుచేసిన డెర్రీలు, డోర్ మేట్స్, దుప్పట్లు, టవల్స్, జ్యూట్ బ్యాగ్‌లు, ఫినాయిల్, బ్యాకరీ తినుబండారాలు సరసమైన ధరలకు అమ్ముతుంటారు. వీటితో పాటు ముఖ్యంగా కేంద్రకారాగారం ఆవరణలో కొన్ని ఎకరాల్లో స్వచ్ఛమైన ఎరువులతో పండించిన కాయగూరలు, ఆకుకూరలు, కొబ్బరికాయలు విక్రయిస్తుంటారు. కేంద్రకారాగారం డెయిరీ ఫాంలో ఆవు పేడతో తయారుచేసిన ఎరువులతో పండించిన ఆకుకూరలు, కాయగూరలను కొనేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తారు. దీనితో పాటు సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి రోజు వాడే ఆవు పేడతో తయారుచేసిన పిడకలు విక్రయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సత్ప్రవర్తన గల ఖైదీలు ఆవుపేడతో తయారు చేసిన పిడకల దండలు ఒక్కొక్కటి రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ఆవు పిడకలు దొరకడం చాలా కష్టంగా మారింది. దీంతో చాలా మంది పిడకల దండలను కొనేందుకు కేంద్ర కారాగారం వద్దకు వస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీల్లో మెట్లు, రోడ్లు, కాలువల పనులకు శనివారం కార్పొరేటర్ మొల్లి హేమలత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కార్పెంటర్స్ కాలనీ, వికలాంగుల కాలనీ, స్వయంకృషినగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి సుమారు రూ.60 లక్షలతో పైపులైన్లు వేస్తున్నట్లు తెలిపారు. వార్డులో సాయిరాం కాలనీ, శారదానగర్, శివశక్తి నగర్ తదితర కొండవాలు ప్రాంతాల్లో రోడ్లు కాలువలు మెట్లు మార్గాలు వేయాల్సి ఉందని, దశలవారీగా తొందరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, పార్టీ వార్డు అధ్యక్షులు నాగోతి వెంకట సత్యనారాయణ, బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, కార్యదర్శి ఈగల రవికుమార్, పోతిన అప్పారావు, సూర్య, శ్రావణి, సతీష్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో ఫాగింగ్

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో శనివారం దోమల నివారణకు జివిఎంసి ఆధ్వర్యాన ఫాగింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా పారిశ్రామిక ప్రాంత సంఘ సేవకులు పెద్దిరెడ్ల నానాజీ మాట్లాడుతూ, ఈ ప్రాంతంలోని 7 వార్డులలో దోమలు తీవ్రంగా ఉండటంతో జివిఎంసి అధికారులతో మాట్లాడి అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేయించినట్లు తెలిపారు.

ఫాగింగ్ చేయిస్తున్న పెద్దిరెడ్ల నానాజీ

ప్రతి అక్షరం-ప్రజల పక్షం
ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
అనుభవం కలిగిన
సబ్ ఎడిటర్
కావలెను
ప్రజాశక్తి కార్యాలయం
ప్లాట్ నెం.3, జి.బ్లాక్, ఆటోనగర్, ఇండస్ట్రియల్ పార్క్,
వడ్లపూడి, ఎం.వి.వి.అపార్ట్‌మెంట్ ప్రక్కన
విశాఖపట్నం-530046
ఫోన్ : 9491570765

ప్రజా వైద్యులు రామారావు

ప్రజాశక్తి -తగరపువలస : ప్రముఖ వైద్యులు కె.రామారావు ఈ ప్రాంతంలో సుదీర్ఘ కాలంగా వైద్య సేవలందిస్తూ ప్రజా వైద్యులుగా గుర్తింపు పొందారని విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పాడ అప్పారావు, కళాకారులు ఎం.సత్యారావు తదితరులు కొనియాడారు. స్థానిక క్లినిక్‌లో శనివారం డాక్టర్ రామారావును ఘనంగా సన్మానించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా పనిచేసిన కాలంలో ఎంతో మంది పేదలకు నిరంతరం వైద్య సేవలు అందించారని కొనియాడారు. పేద రోగుల పట్ల ఆయన మానవత్వం కనబరుస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎ.రామకృష్ణ, బి.సంధ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రామారావును సన్మానిస్తున్న అప్పారావు తదితరులు

తాగునీటి బోరు ప్రారంభం

బోయివీధిలో తాగునీటి బోరును ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు దుర్గారావు తదితరులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి బోయివీధిలో జివిఎంసి నిధులతో ఏర్పాటుచేసిన తాగు నీటి బోరును గ్రామ పెద్దలు కె.దుర్గారావు, కె.కాశీడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బోర్లు ఏర్పాటుచేసినందుకు స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు, వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కె.నాగరాజు, నూకరాజు, కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు అల్పాహారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్వామి యోగానంద ఆశ్రమం వ్యవస్థాపకులు పి.ఎల్లయ్యమ్మ వర్ధంతి సందర్భంగా చిట్టివలస కెజిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మండలంలోని తాళ్లవలస అనాథ బాలల సంరక్షణ కేంద్రంలో ఉన్న పిల్లలకు శనివారం ట్రస్టు నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కాళ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పిట్ట వెంకటరావు, మానవ హక్కుల సంఘం సభ్యులు కె.శ్రీరామచంద్రమూర్తి, ట్రస్టు సభ్యులు పురుషోత్తం, ప్రవాస భారతీయులు ఎం.దినేష్, సంరక్షణ కేంద్రం నిర్వాహకులు వి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు అల్పాహారం అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్ తదితరులు

నేరాలు ఘోరాలు

బస్సు నుంచి పడి విద్యార్థిని మృతి

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ పరిధి ఏనుగులపాలెం వద్ద శనివారం బస్సు ఎక్కుతూ జారి పడి విద్యార్థిని మృతిచెందింది. తగరపువలసలో ఉన్న ఉన్న బాసర కాలేజీకి వెళ్లేందుకు కళాశాల బస్సును విద్యార్థిని భరణి (17) ఎక్కుతున్నారు. ఈ క్రమంలో అదుపు తప్పి పడిపోయారు. స్పృహ కోల్పోయిన విద్యార్థినిని స్థానికులు వెంటనే గాయత్రి హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పద్మనాభం సిఐ శ్రీధర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన భరణి

బాసర కాలేజీ యాజమాన్యంపై చర్య తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

పండగ సెలవుల్లో కాలేజీ నిర్వహించి విద్యార్థిని మృతికి కారణమైన తగరపువలస బాసర కాలేజీ యాజమాన్యంపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ భీమిలి జోన్ కార్యదర్శి కె.తేజశ్రీ డిమాండ్ చేశారు. భరణి భౌతికకాయాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా తేజశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వం పండగ సెలవులు ప్రకటించినా సరే పరీక్షల పేరుతో తరగతులకు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల ఇటువంటి దుర్ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాలేజీ బస్సులలో విద్యార్థులను పరిమిత సంఖ్యకు మించి ఎక్కిస్తున్నా రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేయడం లేదన్నారు. బాసర కాలేజీ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా భరణి నిండు ప్రాణం కోల్పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ఇంటర్మీడియట్ ప్రాంతీయాధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి.సాయితేజ, శ్రీనివాస్, చాందిని, వాసవి పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం దొండపూడి శివారు తోటల్లో కోడిపందాలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి నాలుగు కోడిపుంజులు, రూ.810 నగదు, ఏనిమిది ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేశామన్నారు. గ్రామాలలో కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే తమకు సమాచారం అందివ్వాలని ఎస్సై కోరారు.

రెండు బైక్‌లు ఢీకొని ఒకరు దుర్మరణం

ప్రజాశక్తి-యలమంచిలి : ఎర్రవరం జాతీయ రహదారి 16 ఘర్ డాబా సమీపంలో శనివారం ఉదయం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో పెదపల్లికి చెందిన బొద్దపు త్రినాధరావు (52) అనే వ్యక్తి దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. శవ పంచనామా చేసి అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు టౌన్ ఎస్ఐ సావిత్రి దర్యప్తు చేస్తున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి.

బావిలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి చెందిన ఉదంతం మండలంలోని ఆర్‌వై.అగ్రహారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన గొర్లి అప్పారావు (78) ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం ఇంటి నుండి వెళ్లగా ఆ రోజు నుండి కనిపించలేదు. దీనిపై అతని కుమారుడు గొర్లి అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఈ నెల 11న శనివారం వారాడ శివారు ఎడ్లవానిపాలెం వద్ద వ్యవసాయ బావిలో మృతదేహాన్ని స్థానికులు గమనించి తెలియజేశారు. దీంతో కుమారుడు అప్పారావు ఈ సంఘటనపై ఏ.కోడూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎన్టీఆర్ ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రికి తరలించారు. మృతుని కుమారుడు అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ కోడూరు ఎస్సై డి.లక్ష్మీనారాయణ విలేకరులకు తెలియజేశారు.

బాలికలను రక్షించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బాలికలను రక్షించాలంటూ శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద గరికిన పార్వతి కుటుంబ సభ్యులు కళ్ళకు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము తాటిచెట్లపాలెం వాసుదేవనగర్‌లో నివసిస్తున్నామని తెలిపారు. తాను, తన భర్త, ఇద్దరు ఆడపిల్లలతో నివసిస్తుండగా, గత నెల 17వ తేదీన తమ చిన్న కుమార్తె హాసినీ(15) తమతోపాటు నిద్రిస్తూ, రాత్రి సమయంలో ఇంటిలో కనిపించకుండా పోయిందని తెలిపారు. తన పెద్ద కుమార్తె తెల్లవారుజామున 3 గంటల సమయంలో బాత్ రూమ్‌కు వెళ్లాలని మేల్కొనగా, తనతో పాటు నిద్రిస్తున్న చెల్లి హాసిని లేకపోవడాన్ని గుర్తించి, తనను మేల్కొల్పి చెప్పిందని వివరించారు. ఆందోళనకు గురైన తామంతా హాసిని కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ, బంధువుల ఇళ్లలోనూ వెతికినా ఆచూకీ తెలియలేదన్నారు. దీంతో తాము ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశామని, కేసు నమోదు చేసి 22 రోజులు కావస్తున్నా ఇంతవరకూ తమ కుమార్తె ఆచూకీని కనిపెట్టలేదని వాపోయారు. తమ కుమార్తె హాసిని గురుద్వారా అర్చి దగ్గర ఒక బ్యూటీ షాపులో పనిచేస్తుందని ఉదయం 8 గంటలకు వెళ్లి రాత్రి 8 గంటలకు తిరిగి వస్తుందన్నారు. ఆ రోజు కూడా తిరిగి వచ్చిందన్నారు. మసీదు వద్ద ఉండే ఒక ఆటో డ్రైవర్ తమ కుమార్తెను తీసుకెళ్లి ఉండవచ్చని అనుమానిస్తున్నామని చెప్పారు. తమ అమ్మాయి ఫోన్ నెంబర్, ఆటో డ్రైవర్ ఫోన్ నెంబర్‌ను పోలీసులకు ఇచ్చినా నేటికీ కనిపెట్టలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పివి.రమణమూర్తి

కేలండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మాధవధార : మాధవధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కేలండర్, డైరీని కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణమూర్తి శనివారం ఆసుపత్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలు ప్రజలకు నేరుగా తెలిపేది పాత్రికేయుల ద్వారానేనని అన్నారు. సమాజ సేవలో ముందుండే జర్నలిస్టుల సేవలు మరువలేనివన్నారు. పాత్రికేయ మిత్రుల సంక్షేమం కోసం ఒక వేదిక ఏర్పాటు చేయడం అభినందనీయమని అసోసియేషన్ సభ్యులను అభినందించారు.

వివేకానంద జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి -ములగాడ : శ్రీ స్వామి వివేకానంద హైస్కూల్, బీఈడీ కాలేజీలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ దాసరి మురళీకృష్ణ, దాసరి రైను పూలమాలవేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఏటా పాఠశాలలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలని...

గంగవరం నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి -గాజువాక : తమకిచ్చిన హామీలను నెరవేర్చాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అదాని గంగవరం పోర్టు నిర్వాసితులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన శనివారం పోర్టు బ్రిడ్జి సమీపంలో నిరసన తెలిపారు. వారికి మద్దతు తెలుపుతూ సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, అదాని గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అదాని గంగవరం పోర్టు కుట్ర పూరితంగానే కార్మికులను ప్యాకేజీ పేరుతో రోడ్డున పడేసిందన్నారు. అదాని గ్రూపు సంస్థలకు రోజుకు రూ.1600 కోట్లు వస్తుందని, అందులో కొద్ది భాగం కేటాయిస్తే గంగవరం పోర్టు నిర్వాసితులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. నిర్వాసితులకు జెట్టీ నిర్మిస్తామని ప్రభుత్వం చెప్పి పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. నిర్వాసిత కమిటీ నాయకులు నొల్లి తాతారావు మాట్లాడుతూ, ఇప్పటికే నిర్వాసితులకు అన్ని విధాలా అన్యాయం జరిగిందన్నారు. ఉద్యోగాలు, జెట్టీ లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడం వల్ల దిబ్బపాలెం, గంగవరం గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే జెట్టీని నిర్మించాలని కోరారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం, స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కమిటీ సభ్యులు గంటిపిల్లి అమ్మోరు మాట్లాడుతూ, తక్షణమే సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. తమతో జరిగిన ఒప్పందం ప్రకారం రూ.27 లక్షల చొప్పున చెల్లించాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ మేరకు జెట్టీ నిర్మాణం, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాసిత ఉద్యోగుల సంఘం నాయకులు కదిరి సత్యానందం, పెదగంట్యాడ నిర్వాసిత నాయకులు గొందేశి మహేశ్వర్‌రెడ్డి, కంబాల దానయ్య, వాసుపల్లి ఎల్లయ్య, చీకటి అప్పారావు, మోటూరు రాము, కదిరి తాతారావు, కదిరి సింహాద్రి, బడిరాజు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న గంగవరం నిర్వాసితులు

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : గంట్ల

మాట్లాడుతున్న గంట్ల శ్రీనుబాబు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. డైమండ్ పార్క్ సమీపంలోని ఒక హోటల్లో శనివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, ఏపి స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా శాఖల కార్యవర్గ సభ్యుల సంయుక్త సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫెడరేషన్ పాటుపడుతోందని చెప్పారు. ముఖ్యంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం, అధికారులతో చర్చిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జర్నలిస్టుల పిల్లలకు ఉపకారవేతనాలు ఇస్తామన్నారు. ఫెడరేషన్ విశాఖ అధ్యక్షుడు పోతుమహంతి నారాయణ్ మాట్లాడుతూ, రాష్ట్ర నాయకత్వం ఆదేశాలమేరకు జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై నిరసన కార్యక్రమం చేపట్టబోతున్నట్లు తెలిపారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టి రక్షణ కల్పించాలని, వెంటనే ఎటాక్స్ కమిటీలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యవర్గ సభ్యులకు సంక్రాంతి సందర్భంగా మిఠాయిలు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరి ఎ.సాంబశివరావు, కోశాధికారి బి.సీతారామమూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరి డి.రవికుమార్, బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వెంటనే ఆపాలని విశాఖ స్టీల్‌ప్లాంట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే లకే రాజారావు డిమాండ్ చేశారు. పౌర గ్రంథాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మోడీ విశాఖ వచ్చి స్టీల్‌ప్లాంట్‌పై ఒక్క ప్రకటన కూడా చేయలేకపోవడం విచారకరమన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే అంశాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పక్క దారి పట్టిస్తున్నాయని విమర్శించారు. నోరు మెదపని నాయకులు ఇప్పటికైనా ప్రజల కోసం మాట్లాడాలన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం ఎన్నికలు ముందు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటుకు అప్పగిస్తే విశాఖ జన జీవనం మారిపోతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల సొత్తు అని, ప్రభుత్వమే నడపాలని డిమాండ్‌చేశారు. స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గత 4 నెలలుగా కార్మికులకు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడం మంచిది కాదన్నారు. ప్రజా ఉద్యమంతో వచ్చిన ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లో కూడా వదులుకోబోమని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ కోసం మరోసారి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు రామారావు, కట్ట మల్లేశ్వరరావు, శివప్రసాదరావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి

ప్రజాశక్తి - భీమునిపట్నం : స్థానిక ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యాన భీమిలిలో శనివారం మాజీ ప్రధాని మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి వర్ధంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షులు కెఎస్ఆర్.కృష్ణారావు, గౌరవాధ్యక్షులు గంటా నూకరాజు మాట్లాడుతూ, లాల్ బహదూర్ శాస్త్రి జీవితం నేటి తరానికి ఆదర్శనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్లు ప్రారంభం

బ్యాటింగ్ చేస్తూ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జగన్నాథం

ప్రజాశక్తి -యంత్రాంగం

ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు పరిధిలో ఏర్పాటుచేసిన సంక్రాంతి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను కార్పొరేటర్ బొండా జగన్నాధం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. సిద్ధార్థనగర్‌కు ఆనుకొని ఉన్న 4.30 ఎకరాల స్థలంలో సుమారు రూ.2 కోట్లతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, వచ్చే ఏడాదికి పనులు పూర్తవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు అభివృద్ధి కమిటీ చైర్మన్ విజయరామరాజు, జనసేన నాయకులు ఇందిరా ప్రియదర్శిని, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద, కోమటి శ్రీను, ప్రగడ శ్రీను, కొన్న నారాయణ, దానప్పలు, సన్యాసిరావు, గోవిందరాజు, రమణ, రవి, నారాయణ, ఆర్గనైజింగ్ సభ్యులు పాల్గొన్నారు.

రేవిడిలో

పద్మనాభం : సంక్రాంతి సందర్భంగా మండలంలోని రేవిడి గ్రామ పంచాయతీ పరిధిలో క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం లావణ్య లహరి గ్రూప్ అధినేత గొలగాని శ్రీనివాస్ ప్రారంభించారు. కె.సురేష్, బంగారునాయుడు, గౌతమ్ సమర టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఆది ఆర్మీ సూపర్ కింగ్, జెడి కె లారెన్స్, ఎస్‌బిటి లివిన్, సమల వారియర్స్, టీం వైపర్ జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రొ కబడ్డీ తెలుగు టైటానిక్ సిఇఒ త్రినాథ్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు సూర్యపుడు, నాయకులు బి.అప్పలనాయుడు, ఎం.అప్పారావు, జె.అప్పారావు, రామకృష్ణ, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకు రైతుల బకాయిలు చెల్లించాలి

గోవాడ ఫ్యాక్టరీ గేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో చెరుకు రైతులకు బకాయి ఉన్న రూ.7 కోట్లు చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చెరుకు రైతులు సంఘం ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ గేటు వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. అనంతరం చోడవరంలోని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజుని కలిసి ఫ్యాక్టరీ బకాయిలపై, క్రషింగ్‌పై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబులు మాట్లాడుతూ సకాలంలో పేమెంట్లు చెల్లించకపోవడం వల్ల నిరాశకు గురైన రైతులు చెరుకు పంట విస్తీర్ణం తగ్గించి వరి, సరుగుడు, ఇతర పంటలు వేస్తున్నారని తెలిపారు. కనీసం మద్దతు ధర, ప్రభుత్వ ప్రోత్సాహం తగినంత ఉండడం లేదన్నారు. గోవాడలో డిస్టలరీ యూనిట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే రాజు ఆచరణ రూపం దాల్చడం లేదని, ఆయన మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని పేర్కొన్నారు. రైతుల్లో నమ్మకాన్ని కలిగించేటట్టు వెంటనే బకాయిలు చెల్లించాలని, కనీసం మద్దతు ధర సోమనాథన్ కమిటీ సిఫార్సులు అనుకూలంగా రూ.5000, ప్రకటించాలని ఫ్యాక్టరీని ఆధునికరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు బి దేవుళ్ళు, శరగడం విశ్వనాథం, బుద్ధగిరి పెంటయ్య, ఈశ్వరరావు, పొలమరశెట్టి తాత, అప్పారావు పాల్గొన్నారు.

బకాయి జీతాల కోసం కార్మికుల ఆందోళన

చోడవరం : గోవాడ సుగర్ ఫ్యాక్టరీలోని కార్మికులకు గత నాలుగు నెలల నుంచి బకాయి పడ్డ రూ.6 కోట్లు వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శనివారం ఫ్యాక్టరీ గేటు వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫ్యాక్టరీలోని పర్మనెంటు, ఎన్ఎంఆర్, కాంట్రాక్ట్, ఓచర్ పేమెంట్ కార్మికులు సుమారు 352 మంది జీతాలు లేక అల్లాడిపోతున్నారని, ఫ్యాక్టరీ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని వారికి బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. పండగ పూట కూడా కార్మికులకు వేతనాలు లేకుండా పస్తులు పెట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. ఎన్నికలు ముందు కూటమి పార్టీల నాయకులు ఫ్యాక్టరీని ఆధునీకరించి రైతులు, కార్మికులు బకాయిలు లేకుండా చేస్తామని చెప్పిన మాటలు నేటికీ నెరవేరలేదన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని బకాయిలు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం, సిఐటియు నాయకులు

ఎంపీ సిఎం.రమేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

చోడవరం రూరల్ : జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలను ఆదుకుంటామని, అన్ని కర్మాగారాలను తెరుస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ నిలబెట్టుకోవాలని, రైతులు, కార్మికులకు బకాయిలు చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో శుక్రవారం నుండి కార్మికులకు బకాలు, రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యుటీ, పెన్షన్ చెల్లించాలని కార్మికులు చేస్తున్న పోరాటానికి సిపిఎం సంపూర్ణమైన మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. గతేడాది సరఫరా చేసిన చెరుకుకు నేటికీ బకాయిలు చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్ రైతులను, కార్మికులను నమ్మించి మోసం చేసారని విమర్శించారు. వెంటనే కార్మికులు, రైతులకు బకాయిలు చెల్లించ కుంటే సిపిఎం ప్రత్యేక్ష పోరాటానికి పూనుకుంటుందని వెంకన్న హెచ్చరించారు.

ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

ప్రజాశక్తి -అనకాపల్లి

ప్రభుత్వ ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరాంధ్ర వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు కెవిఎల్‌జె మోహనరావు, కుంది వెంకట సూర్యనారాయణ, గోవింద్, జామి రాము, దిమిలి సన్యాసిరావు తదితర సంఘ ప్రతినిధులు పాల్గొని ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. స్వాతంత్ర్యంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఓబన్న స్ఫూర్తిని యువత ఆదర్శం గా తీసుకోవాలని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కె.రాజేశ్వరి, చోడవరం అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ అధికారి నాగేశ్వరరావు, హెచ్‌డబ్ల్యుఎస్ జిల్లా జనరల్ సెక్రెటరీ పీలా కనక వెంకట నారాయణరావు, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : రేనాటి వీరునిగా పేరుగాంచిన వడ్డే ఓబన్న జయంతి కార్యక్రమాన్ని శనివారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి, రెండో జోనల్ కమిషనర్ ఎంవిడి.ఫణిరామ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అప్పలనాయుడు, అసిస్టెంట్ ఇంజినీర్ ఆనంద్, పర్యవేక్షకులు రియాజ్, జివిఎంసి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నవోదయ టాలెంట్ టెస్టు

ప్రజాశక్తి-చోడవరం : పిఆర్‌టియు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో చోడవరం ఆడమ్స్ పాఠశాలలో ఈ నెల 12న ఆదివారం నవోదయ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు పిఆర్‌టియు మండల అధ్యక్షుడు కార్యదర్శులు ఎంవీ స్వామి, కేఎల్ఎం గణేశ్వరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 9 గంటలకల్లా స్కూల్ వద్దకు చేరుకోవాలన్నారు. ఆపై వచ్చిన వారిని పరీక్షకు అనుమతించింది లేదని స్పష్టం చేశారు.

బహుమతులు అందిస్తున్న దృశ్యం

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-చోడవరం : సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉషోదయ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించిన విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న చుక్కపల్లికి చెందిన సకల మాధవి సాకేత్ ఫౌండేషన్ నిర్వహించిన వ్యాసరచన పోటీలో నేటి పరిస్థితుల్లో రాజ్యాంగం మార్పు చేయడం అవసరమా అనే అంశానికి ప్రథమ స్థానం పొందగా ఆమెను ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ జె.రమణజీ, కరస్పాండెంట్ కృష్ణకుమారి, డీన్ వెంకట వాసు, ప్రిన్సిపాల్ ఎస్ఎన్ నాయుడు, అధ్యాపక బృందం అభినందించారు.

ముమ్మరంగా వరి నూర్పులు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో వరి నూర్పులతో రైతన్నలు బిజీగా ఉన్నారు. ఈ ఏడాది వరి దిగుబడి పెరిగింది. వరస తుఫాన్లు వల్ల నూర్పులు ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం రైతన్నలు ఒకరికొకరు సాయం చేసుకుని వరినూర్పులు పూర్తి చేస్తున్నారు. నూర్పు చేసేందుకు ట్రాక్టర్‌కి గంటకు 900 రూపాయలు కాక మగ కూలికి రూ.500, ఆడ కూలీలకు రూ.400 చొప్పున చెల్లిస్తున్నారు. వ్యవసాయంలో యంత్రాల వాడకం పెరగడంతో గతంతో పోలిస్తే ఇప్పుడు రైతులకు కొంత సుఖంగా పనులు జరుగుతున్నాయని చెప్పుకోవచ్చు. సంక్రాంతి లోగా వరి నూర్పు పనులు పూర్తి చేసుకోవడానికి రైతన్నలు పట్టుదలతో పని చేస్తున్నారు.

చంద్రబాబును కలిసిన పీలా, బత్తుల

ప్రజాశక్తి-అనకాపల్లి : గుంటూరు జిల్లా మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వాల నమోదుపై వారు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.

పండగ పూటా పస్తులేనా?

జివిఎంసి క్లాప్ వెహికల్స్ యార్డు వద్ద లోడర్స్ ధర్నా

క్లాప్ వెహికల్స్ యార్డు వద్ద ఆందోళన చేస్తున్న లోడర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి

పండుగ పూట కూడా వేతనాలను కాంట్రాక్టర్లు వేయకపోవడంతో అనకాపల్లి జివిఎంసి క్లాప్ వెహికల్స్ యార్డు వద్ద లోడర్స్ శనివారం ఉదయం 5.30 గంటల నుంచి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు రొత్తల శంకరరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్ 4 నెలల జీతాలు వేయవలసిందిగా, ధర్నా చేస్తే ఒక నెల మాత్రమే అది కూడా సగం జీతం వేసి మిగతా దానికి మొండి చేయి చూపడం దారుణమన్నారు. పండగ పూట కూడా కార్మికులకు పస్తులేనా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మళ్లీ పని నిలుపుదల చేసి నిరసన చేయడం జరుగుతుందన్నారు. జీవీఎంసీ మెయిన్ కమిషనర్ మొత్తం వేతనాలు వేయిస్తామని చెప్పినప్పటికి వేయకపోవడం చూస్తుంటే కమిషనర్ మాట కూడా కాంట్రాక్టర్ వినే పరిస్థితి లేదని అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ మొండి వైఖరి విడనాడి కార్మికులకు ఇంతవరకు రావలసిన వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భారతి, ప్రసాద్, పి.గోవిందు, వై.శివ, భాస్కర్, భవాని పాల్గొన్నారు.

ముగిసిన డావిన్సీ ఉత్సవాలు

ప్రజాశక్తి- మునగపాక

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో డావిన్సీ అంతర్జాతీయ పాఠశాలలో నిర్వహించిన డావిన్సీ-2025 ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. స్విమ్మింగ్ జూనియర్స్ అండ్ సీనియర్స్, స్కేటింగ్, జూడో, కరాటే, అథ్లెటిక్స్ 100 మీటర్స్,400 మీటర్స్ రిలే బాల, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహించారు. తల్లిదండ్రులకు పాటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. డావిన్సీ ఉత్సవ్ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ నాలుగు హౌసెస్‌లో వివిధ విభాగాలలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను, అందజేసి ప్రశంసించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువు కావాలంటే ఒకచోట, ఆటలు పాటలు కావాలంటే వెతుక్కోవలసిన అవసరం లేకుండా డావిన్సీ అంతర్జాతీయ పాఠశాల క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి పట్టణ చదువులకు ఏమాత్రం తీసిపోకుండా ఉండడం పరిసర ప్రాంత ప్రజలు అదృష్టంగా భావించాలని తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టిన మేనేజింగ్ డైరెక్టర్ సుందరయ్య అభినందనీయులన్నారు. కార్యక్రమంలో డావిన్సీ మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య, డైరెక్టర్ రమణాజీ, ప్రిన్సిపల్ మీనా మిశ్రా, నాగులపల్లి మెడిటేషన్ టీచర్ సుజాత, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న పాఠశాల ప్రతినిధులు

రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

దిబ్బిడి ఎగువ వీధిలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామం ఎగువ వీధిలో రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుతపల్లి శ్రీకాంత్ ఇంటి నుండి కోటి కోటమ్మ ఇంటి వరకు గల ఈ రోడ్డుపై ఇళ్లల్లో వినియోగించిన నీటిని రోడ్డుపైకి విడిచిపెట్టడంతో రోడ్డంతా మురుగునీరుతో నిలిచిపోతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. మురుగునీరు వల్ల దోమల వ్యాప్తి చెందుతున్నాయని పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. దోమల పెరిగిపోయి రోగాలు వస్తే తమ పరిస్థితి ఏంటని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకుని రోడ్డుపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పలుచోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

సిసి రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీలో 1.8 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శనివారం ప్రారంభించారు. వాడ చీపురుపల్లి, దళైపాలెం గ్రామాల్లోనూ నిర్మించిన సిసి రోడ్లను, ఎన్టీపీసీ రోడ్డు నుంచి నరసాపురం కాలనీ వరకు నిర్మించిన సిసి రోడ్డును, పోలిరెడ్డి పాలెంలో తారకరామా కాలనీలో నిర్మించిన సిసి రోడ్డును, నాయుడుపాలెంలో నిర్మించిన సిసి రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైల జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, నేతలు వియ్యపు జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బి రామదాసు, పైలా రామ్ నాయుడు, పుర్రె శ్రీనివాస్, జనపరెడ్డి నర్సింగరావు, గొంతున భక్త సాయిరాం , పంచాయతీరాజ్ డిఇ ఎం వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి : మండలంలోని ఏటికొప్పాకలో సిసి రోడ్డు, గోకులం షెడ్డును ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి ముందుగానే అన్ని రోడ్లకు ప్రారంభోత్సవాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ భజంత్రీల లక్ష్మి, కూటమి నాయకులు కాంట్రకోట చిరంజీవి, అన్నం బాబ్జీ, చిన్న, బుగిడి రామ గోవిందా, మోటూరు సన్యాసినాయుడు, ఈశ్వరరావు, మధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలో రామన్నపాలెం కొండకర్ల గ్రామాలలో నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామన్నపాలెం గ్రామ సర్పంచ్ డి నాయుడు బాబు, జడ్పిటిసి మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు, కొలకులూరి విజయబాబు, బొద్దపు శ్రీను, రాజాన శేషగిరిరావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, రమేష్, మాజీ జెడ్‌పిటిసి రాజాన నారాయణమ్మ, ఇత్తంశెట్టి రాజు, సన్యాసి నాయుడు, బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలోని కన్నంపాలెం, అంకుపాలెం, కందిపల్లి, నరసయ్యపేట, మైచర్లపాలెం, జర్నలిస్ట్ కాలనీ తదితర ప్రాంతాల్లో నూతనంగా వేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీల్లో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణానికి గతంలో టిడిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇచ్చిందని తెలిపారు. చోడవరం మండలంలో ఇప్పటివరకు 21 సచివాలయాల పరిధిలో రూ.3 కోట్ల 92 లక్షల 75 వేలుతో 59 చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలు జరిగినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జి వెంకట సత్యనారాయణ, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగగంగాధర్, పంచాయతీరాజ్ ఇంజనీర్ శాంతారావు, ఇఒపిఆర్‌డి మహేష్, ఆయా గ్రామాల స్థానిక ప్రజా ప్రతినిధులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అప్పారావుతో మాట్లాడుతున్న గండి రవికుమార్ తదితరులు

అనారోగ్యంతో బాధపడుతున్న అప్పారావుకు పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : అనారోగ్యంతో బాధపడుతున్న వైసీపీ నాయకుడు కోన అప్పారావును పెందుర్తి నియోజకవర్గం వైస్సార్సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్ శనివారం పరామర్శించారు. మండలంలోని బోదువలస పంచాయతీ వార్డ్ మెంబెర్, వైస్సార్సీపీ సీనియర్ నాయకులు కోన అప్పారావు ఇటీవల అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ఇంటివద్దనే ఉంటున్న విషయం తెలుసుకొని ఆయన తన ఇంటికి శనివారం రవికుమార్ వెళ్లారు. ఆయన ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బోదువలస సర్పంచ్ నేబర్తి శ్రీనివాసరావు, మల్లునాయుడుపాలెం సర్పంచ్ బోను నాయుడు, వైసిపి యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, కోన శ్రీను, రేవడి ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా సామ్రాట్ కుమార్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-సబ్బవరం : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జాతీయ సేవా రత్న గొటివాడ సామ్రాట్ కుమార్ జన్మదినం వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సబ్బవరం గ్రామంలోని పారిశుధ్య కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అనాధలకు అన్నదానం చేసారు. గొర్లివానిపాలెం గ్రామంలో వితంతువులకు, వృద్ధ మహిళలకు వస్త్రాలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో రెడ్డి రామునాయుడు, భూపతి అప్పారావు, ఆకాష్ కుమార్, నీటిపల్లి గౌరి, పారిశుధ్య కార్మిక నాయకులు దొమ్మిసి పెంటరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తున్నామని సర్పంచు తట్టా పెంటయ్య నాయుడు అన్నారు. గ్రామంలో 17వ వార్డులో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడే మహిళలు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంక్రాంతి అనంతరం ఇంటింటికి కుళాయిలు వెయ్యడం జరుగుతుందని చెప్పారు. ఆయన వెంట వార్డు మెంబర్ తర్రా సత్యారావు, గొంతిన గంగాజలం, ఎర్రంశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న దీక్షాధారుల పాదయాత్ర

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొల్లలపాలెం గ్రామానికి చెందిన అప్పన్న స్వామి దీక్షదారులు శనివారం గొల్లలపాలెం నుండి సింహాచలం కొండకు పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. ముందుగా అప్పన్న స్వామి దీక్ష దారులు ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. గొల్లలపాలెం, వెదుళ్ళ నరవ, నంగినారపాడు గ్రామాలకు చెందిన అప్పన స్వామి దీక్షదారులు 60 మంది పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గొల్లలపాలెంకు చెందిన కోసిరెడ్డి అప్పలరాజు, లక్ష్మీ దంపతులు అప్పన్న స్వాములకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి దాసరి అచ్చిబాబు పాల్గొన్నారు.

రూ.1.20 లక్షలతో కల్వర్టుల పునర్నిర్మాణం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి పరిధి గాంధీనగర్ నుండి బస్టాండ్ వీధిలో కల్వర్టు, మెయిన్‌రోడ్డు నుంచి కోర్టుకు వెళ్లే దోవలో పాడైన కల్వర్టులను మరమ్మతులు శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎఇ సుబ్బారావు మాట్లాడుతూ రూ.1.20 లక్షలతో ఈ పనులు చేస్తున్నట్లు చెప్పారు.

కల్వర్టును నిర్మిస్తున్న దృశ్యం

టిటిడి బోర్డు వారినే శిక్షించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తిరుపతిలో తొక్కిసలాట ఘటనలో పూర్తి బాధ్యత తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డుదేనని, అందువల్ల వారినే శిక్షించాలని పలు ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కొడిగంటి గోవిందరావు భవనంలో శనివారం ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు అధ్యక్షతన తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ తిరుపతి లాంటి పుణ్యక్షేత్రంలో తొక్కిసలాట జరగడం, ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. దీని పూర్తి బాధ్యత తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు వారే తీసుకోవాలని, వారిపై కేసులు నమోదు చేసి ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ విమర్శలకు సమయం ఇది కాదని, రాష్ట్ర ప్రధాన రాజకీయ పక్షాలు పరస్పర విమర్శలు శోచనీయమని పేర్కొన్నారు. ఏకాదశి రోజున లక్షలాదిమంది భక్తులు వస్తారని తెలిసినప్పటికీ ఆన్లైన్లో టోకెన్లు మంజూరు నిలుపుదల చేయడమే ఈ దుర్ఘటనకి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. టోకెన్ విధానాన్ని శబరిమల దేవాలయ బోర్డు వారు విజయవంతంగా ఆచరణలో చూపించారని తెలిపారు. శబరిమల దేవస్థానం వారు సుమారు 80,000 టోకెన్లు ఆన్లైన్లో జారీ చేసి, అక్కడ టోకెన్లు లేకుండగా వచ్చిన భక్తులకు పదివేల టోకెన్లు అందుబాటులో ఉంచటం ద్వారా దర్శనానికి వచ్చిన ప్రతీ భక్తునికి దర్శనం కల్పిస్తున్నారని తెలిపారు. ఈ దుర్ఘటన పైన వివిధ రాజకీయ పార్టీలు విమర్శలు ప్రతి విమర్శలు మానుకోవాలన్నారు. కొన్ని మత సంఘాలు వేరే మతాల వారి హస్తం ఉందని ప్రకటనలు చేసి మనోభావాలని రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కోరుబిల్లి శంకర్రావు, సిపిఎం నాయకులు తేలయ్య బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు కొణతాల హరినాధ్, ఐఎఎల్ ప్రతినిధి శేఖర్ మంత్రుల సాయి వెంకట లక్ష్మణ్, ప్రజా సంఘాల ప్రతినిధి కోన లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి వారోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వారోత్సవాల్లో భాగంగా శనివారం ముందుగా బ్రెయిలీ క్యాలెండర్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతి సంవత్సరంలాగే విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం సభ్యులు 100 మంది వికలాంగులకు, యలమంచిలి అమ్మ వెల్ఫేర్ సొసైటీ కుంచ అరుణ్ కుమార్ చేతుల మీదుగా నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వికలాంగులు శ్రద్ధతో చదువుకొని మంచి విద్యావంతులై, ఉన్నతమైన స్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. లూయిస్ బ్రెయిలీ, హెలెన్ కెల్లర్, స్టీఫెన్ హాకింగ్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యలమంచిలి అమ్మ వెల్ఫేర్ సొసైటీ కుంచ అరుణ్ కుమార్, కాంక్రీట్ మిల్లర్స్ అసోసియేషన్ వియ్యపు అప్పారావు సహకారంతో వస్త్రాలు పంపిణీ చేసి వికలాంగులకు భోజనాలు పెట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సుబేదార్ అమరపల్లి సిహెచ్ రామన్ రాయ్, తుమ్మపాల జడ్పీ స్కూల్ స్కూల్ అసిస్టెంట్ రవితేజ, కార్యదర్శి మొల్లిచంద్రశేఖర్, కరణం శివ, వికలాంగులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సంఘం కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో శనివారం ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కేలండర్‌ను ఆసుపత్రి ఆర్ఎంఓ అశోక్ కుమార్, డాక్టర్ లక్ష్మణ శ్రీనివాస్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025లో వైద్య ఉద్యోగులకు అందరికీ మంచిజరగాలన్నారు. ఏపీమెడికల్ ఎంప్లాయిస్ యూనియన్, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పెద్దాడ అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెండింగ్లో ఉన్న బకాయిలు, 12వ పీఆర్సీ కమిటీ వేసి తాత్కాలిక భతి 36 శాతం చెల్లించాలని, ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎస్ఐ బకాయిలు చెల్లించాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియూసీ జిల్లా ఉపాధ్యక్షులు కోన లక్ష్మణ, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాడెం తిరుమలరావు, కోర్పోలు సత్యనారాయణ, నంది కోళ్ల దివాకర్, కాళ్ళ విష్ణు,ఎస్ సంతోష్, పెంటకోట రాఘవ, తాళడ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

ధనుర్మాసం ముక్కోటి ఏకాదశి సందర్భంగా పలు ఆలయాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తుమ్మపాల శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను తిరువీధుల్లో ఘనంగా ఊరేగింపు జరిపారు. మహిళలు ప్రదర్శించిన కోలాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆలయంలో అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ విగ్రహాల దాతలు పడాల గణపతి రావు శారద దంపతులు, గరుడ వాహన విగ్రహదాతలు నడిపల్లి రాము, దంపతులు, పువ్వల వాసు దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు కర్రి బాబి, నడిపల్లి గణేష్, అజయ్, బోను బాబు, నర్సింగరావు, బుదిరెడ్డి సూరిబాబు, గొంతిన శ్రీనివాసరావు, జి వెంకటరావు, పన్నీరు చంటి, ఆర్సీ సత్యనారాయణ, సిరిశాల నాగు తదితరులు పాల్గొన్నారు. సుంకరమెట్ట శ్రీసత్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయంలో చైర్మన్ బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

జగన్ తీరు వల్లే నేడు విద్యుత్ భారాలు

ప్రజాశక్తి-అనకాపల్లి

విద్యుత్ వినియోగదారులపై విద్యుత్ చార్జీలు భారం మోపకుండా డిస్కాంల రెవెన్యూ లోటు 14,683 కోట్లను భరించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సర్దుబాటు చేస్తామని చెప్పడంపై తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక టిడిపి పార్లమెంటు పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. జగన్ రెడ్డి ఎన్నికలకు ముందు అమలు చేయవలసిన బకాయి 12 వేల కోట్లు కూడా ప్రభుత్వంపై భారం పడిందని, అయినప్పటికీ గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతులకు వ్యవసాయ చేసేందుకు పగటిపూట తొమ్మిది గంటల పాటు నిరంతరంగా నాణ్యమైన విద్యుత్తును ఉచితంగా అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో అనకాపల్లి జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, అనకాపల్లి పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్, కార్యదర్శి మల్ల గణేష్, బీసీ నాయకులు బోడి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటనలో..

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్

ఓదారుస్తున్న విజయ్

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఇటీవల తిరుపతి ఘటనలో మృతి చెందిన బొడ్డేటి నాయుడుబాబు కుటుంబానికి అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ తెలిపారు. తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన బొడ్డేడ నాయుడు బాబు కుటుంబాన్ని మున్సిపాలిటీ పెదబడ్డేపల్లిలో కుటుంబాన్ని శనివారం విజయ్ పరామర్శించారు. కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో ఫోన్ లో మాట్లాడించి ధైర్యంగా ఉండాలని చెప్పారనన్నారు. నాయుడుబాబు లేని లోటు కుటుంబానికి తీరనిదని, పార్టీ తరపున అండగా ఉంటామని తెలిపారు. నాయుడుబాబు తెలుగుదేశం పార్టీలో కీలక కార్యకర్తగా ఉండి అనేక సేవలు అందించారని గుర్తు చేశారు. కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షలు, పార్టీ నుంచి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు, రాజుల నాయుడు, రెడ్డి అప్పల నాయుడు, బొడ్డేపల్లి టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కౌన్సిలర్ పద్మావతి

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : స్థానిక స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో శనివారం సభాపతి అయ్యన్నపాత్రుడు సతీమణి, మునిసిపల్ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చేతుల మీదుగా ప్రజాశక్తి దినపత్రిక కేలండర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో ప్రజాశక్తి దినపత్రిక కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. పత్రికా రంగంలో విలేకరులు సమాజ సేవ కోసం పాల్పడాలని హితవు పలికారు. ప్రభుత్వానికి, ప్రజల మధ్య వారధిలా పత్రికా రంగం ఎంతో తోడ్పడుతుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఉన్నత విలువలతో ప్రజాశక్తి దినపత్రిక ముందంజలో ఉందన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ప్రజలకు, శ్రేయోభిలాషులకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నాయకులకు అందరికీ సంక్రాంతి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రవివర్మ తెలుగుదేశం పార్టీ నాయకులు చంటి, ప్రజాశక్తి రిపోర్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల స్థితిగతులపై నివేదిక

యంత్రంలో పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

ప్రజాశక్తి రావికమతం:మండలంలో గుడ్డిప గ్రామంలో

సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు వారు భూగర్భ జలాల పరిస్థితిని ఎంపియుపి స్కూల్ సమీపంలో శనివారం డ్రిల్లింగ్ మిషన్ ద్వారా పరిశీలించారు. మినిస్ట్రీ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో శ్రీ సాయి బోర్వెల్స్ ద్వారా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు జల శక్తి సూపర్వైజర్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాల నాణ్యత, అభివృద్ధి, కాలుష్యం వంటి స్థితిగతులను ప్రతి 8 నెలలకు ఒక మారు పరిశీలించడం జరుగుతుందన్నారు. భూగర్భ జల శాఖ గుర్తించిన ప్రాంతాలలో భూమిలో నీరు ఏ పరిస్థితుల్లో ఉన్నది అన్న విషయాన్ని ఆయా గ్రామాలలో నీటిని పరిశీలన చేసి తగు నివేదికలను ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందన్నారు. ఈ రిగ్గు మిషను ద్వారా భూమిలోకి 420 అడుగుల వరకు వెళ్లి నీటి నాణ్యతను పరిశీలించడం జరుగుతుందన్నారు. ప్రజలు మంచినీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గాను, అలాగే కలుషితమైన నీటిని తాగడంతో అనేకమంది ప్రజలు అనారోగ్యం బారిన పడిన పరిస్థితిని చూస్తున్నామన్నారు. .అటువంటి పరిస్థితిని అధిగమించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్జి అప్పారావు(కొండయ్య), పిల్ల అచ్చం నాయుడు, ఎంపియుపి స్కూల్ చైర్మన్ గల్లా స్వామి, సోషల్ మీడియా ప్రతినిధి గల్లా నాని బాబు, పిల్లా రమణ ,పెద్దాడ అప్పారావు, జి సత్యా రావు, పిల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఊరికెళ్తున్నారా..జాగ్రత్తలు తీసుకోండి

- టౌన్ సిఐ గోవిందరావు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సంక్రాంతి పండుగకు ఊరు వెళ్తున్న వారంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక టౌన్ సిఐ గోవిందరావు సూచించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సంక్రాతి పండుగకు సొంత ఊరికి వెళుతున్న వారంతా బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు బ్యాంక్ లాకర్లలో భద్రపర్చుకోవాలన్నారు. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవా లన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదని, వెంటే తీసుకెళ్లాలని సూచించారు. ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉండే తాళం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఊరికి వెళుతున్న వారంతా స్థానిక పోలీస్టేషన్‌లో సమాచారం ఇస్తే ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ద్విచక్ర వాహనాలకు తప్పనిసరిగా చైన్స్‌తో లాక్ వెయడం మంచిదన్నారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్థానిక పోలీసులకి, డయల్ 100 కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-రావికమతం:సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామాల్లో కోడి పందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని రావికమతం ఎస్ఐ రఘువర్మ హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా నిర్వహించుకోవాలన్నారు. విచ్చలవిడిగా మద్యం సేవించి రాస్ డ్రైవింగ్ చేస్తే ఆకతాయిలపై కేసులు నమోదు తప్పవన్నారు. పండగకు వెళ్లేవారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అటువంటి ఇల్లు పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామాలలో మహిళల పట్ల ఆసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు.

గొలుగొండ:సంక్రాంతి నేపథ్యంలో కోడిపందేలు, పేకాట ఆడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని గొలుగొండ ఎస్సై రామారావు హెచ్చరించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ రోజులలో సాంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కోడి పందేలు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా పెట్టినట్లు చెప్పారు. జూదాలతో సులభంగా డబ్బులు సంపాదించాలని ప్రజలు ఆశ పడి నష్టపోతున్నారన్నారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే భవిష్యత్తు అంధకారం అవుతుందని ఎస్ఐ తెలిపారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో శనివారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుండి భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు ప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పుష్ప తోటలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వైభవంగా తిరువీధి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పూజలు చేస్తున్న భక్తులు

రంగురాళ్ల క్వారీలపై నిరంతర నిఘా

మాట్లాడుతున్న రేంజర్

ప్రజాశక్తి-గొలుగొండ:రంగురాళ్ల క్వారీలపై నిరంతరం నిఘా ఉంచామని నర్సీపట్నం అటవీశాఖ రేంజర్ లక్ష్మీనర్స్ అన్నారు. శనివారం గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామస్థులతో సమావేశమయ్యారు. గతంలో రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడిన వారి కదిలికలపై దృషి పెట్టామన్నారు. ప్రజలు ఎవరూ రంగురాళ్ల తవ్వకాలకు పాల్పడవద్దన్నారు. తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని అటవీశాఖ రేంజర్ తెలిపారు.

ఆయుర్వేద వైద్యునిగా రఘు నియామకం



ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రి నూతన వైద్య అధికారిగా డాక్టర్ రఘు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన వేంపాడు ఆయుర్వేద ఆసుపత్రిలో బాధ్యతలు స్వీకరించారు. గత 16 నెలల నుంచి ఎలమంచిలి ఆయుష్ డాక్టర్ వినయ్ కుమార్ ఇన్చార్జిగా పని చేశారు.ఆయన స్థానంలో వేంపాడుకు రెగ్యులర్ డాక్టర్ ను ఆయుష్ కమిషనర్ నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ, ఎటువంటి దుష్ప్రభావం లేని ఆయుర్వేద వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత శనివారం పంచాయతీలో పారిశుధ్య కార్మికులకు సంక్రాంతి పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను అందించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు గ్రామాలలో చేస్తున్న సేవలు వర్ణనాతీతమన్నారు. వారి సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పారిశుద్య కార్మికులు సంతోషంగా ఉంటేనే గ్రామాలు పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

దుస్తులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సుజాత

తాగునీటి బోరు పనులు ప్రారంభం

ప్రజాశక్తి రావికమతం :మండలంలో గుడ్డిప గ్రామంలో మంచినీటి బోరు పనులను సర్పంచ్ గుమ్మాల గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువుల పాకల వద్ద మంచినీటి సదుపాయం లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దృష్ట్యా ఎంపీపీ పైలరాజు దృష్టికి తీసుకు వెళ్లామన్నారు.దీంతో గల్లా వారి పాకల వద్ద శనివారం బోరు వేయడం జరిగిందన్నారు. మంచినీరు కావాలంటే ఇంటి దగ్గర నుంచి ప్రతిరోజు తీసుకు వెళ్లడం రైతులకు చాలా కష్టమన్నారు. ఇకనుంచి ఈ ఇబ్బందులు తొలగినట్లేనని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అడ్డూరి సత్యారావు, గల్లా శ్రీను, గల్లా సత్యారావు, పరుశురాము పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

చలిసింగం రహదారిని పరిశీలించిన అటవీ అధికారులు

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొండలు మధ్యలో ఉన్న చీమలపాడు శివారు చలిసింగం గిరిజన గ్రామానికి తారు రోడ్డు నిర్మాణానికి ఆటవీశాఖ అనుమతులపై అధికారుల బృందం శనివారు పరిశీలన చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో చలిసింగం గిరిజనులు గుర్రాలతో వినూత్న రీతిలో నిరసనలు, ఆందోళనలు చేయడంతో శనివారం డిఎఫ్‌వో .శామ్యూల్, చోడవరం రేంజ్ అధికారి కె.వి.రవివర్మ, మేడివాడ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ బాబు, సర్పంచ్ గంగరాజు, సీపీఎం నాయకులతో కలిసి కొండ దిగువ సీకాయపాడు నుంచి చలిసింగం వరకు కొండల మధ్యలోంచి నడిచి వెళ్లి రోడ్డు నిర్మాణంపై పరిశీలించారు. రోడ్డు నిర్మిస్తే పారెస్టు భూమి ఎంత ఇవ్వాల్సి ఉంటుందని ఆరా తీశారు. రోడ్డు నిర్మాణం జరిగితే ఆర్వోయఫ్‌ఆర్‌లో ఎంతమేర అటవీ భూమిని కోల్పోవాల్సి వస్తుందో పరిశీలించారు. ఫారెస్ట్ అనుమతులు ఇచ్చి రోడ్డు నిర్మాణం జరిగేలా చూడాలని సర్పంచ్ గంగరాజు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందరావు డి ఎఫ్ వో ను కోరారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది, గిరిజన సంఘ నాయకులు చీపురు శంకరరావు తదితరులు పాల్గొన్నారు....

నేడు నవోదయ నమూనా పరీక్ష

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఈనెల 12న నవోదయ గ్రాండ్ మోడల్ టెస్ట్ నిర్వహిస్తామని పి ఆర్‌టియు అధ్యక్షుడు డిజి నాథ్ తెలిపారు. ఈ పరీక్షలతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా నిర్ణీత సమయంలో పరీక్ష పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యాన్ని పెంచడానికి ఉపయోగపడ తాయన్నారు. నవోదయ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోర్టు అధికారులతో ట్రైనీ ఐఎఎస్‌లు

పోర్టును సందర్శించిన ట్రైనీ ఐఎఎస్‌లు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: ఐఎఎస్ ట్రైనీ అధికారుల బృందం తమ వింటర్ స్టడీ టూర్‌లో భాగంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)ని శనివారం సందర్శించింది. పోర్ట్ ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. పోర్ట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ట్రైనీ అధికారులకు వివరించారు. ప్రధానంగా కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యం, ఆధునీకరణ, మెకనైజేషన్ ప్రాజెక్టులు, కవర్డ్ స్టోరేజ్, సోలార్ పవర్ ప్లాంట్, ట్రక్ పార్కింగ్ టెర్మినల్ తదితర వాటిపై పోర్ట్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ విభాగాధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి -చింతపల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 7న చిలికల వీధి గ్రామంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ ఉల్లి బాబురావు కుటుంబానికి ఆటో యూనియన్ మండల అధ్యక్షుడు సంపరి రమణ చేతుల మీదుగా ఆర్థిక సహాయం చేయడం జరిగిందని లోతుగడ్డ జంక్షన్ సిద్ధి వినాయక యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, అరుణ్ కుమార్ తెలిపారు. 50 కేజీలు బియ్యం, నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం చేయడం జరిగిందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అభి, చిన్న, రాము, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అల్లూరి విగ్రహ ధ్వంసంపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: మండలంలో లింగరాజు పాలెం గ్రామంలో డిసెంబర్ 31 అర్ధరాత్రి కొంతమంది దుండగులు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నేతలు, క్షత్రియ సేవా సమితి సభ్యులు కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ, లింగరాజుపాలెం గ్రామానికి చెందిన క్షత్రియ సేవా సమితి సభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు చేసి నేటికీ 12 రోజులు అవుతున్నా దుండగులను అరెస్టు చేయలేదన్నారు. హోం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గ రాయవరం మండలంలో ఈ ఘటన జరిగినా స్పందించకపోవడం శోచనీయమన్నారు. హోంమంత్రి స్పందించి దుండగులను అరెస్టు చేసే విధంగా పోలీస్ వారికి ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఇటువంటివి పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.సత్యనారాయణ, ఎం.రాజేష్, గణపతి రాజు, ఏ.సీతారామరాజు, సాంబమూర్తి రాజు, సన్యాసిరాజు, డి.సీతారామరాజు, అప్పలనరసింహరాజు, వెంకట కృష్ణం రాజు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

వైభవంగా సంక్రాంతి సంబరాలు

సంబరాల్లో పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి గాంధీనగర్‌లోని గిరీష్ విద్యానికేతన్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంబరాల్లో భాగంగా విద్యార్థులు రైతులు, బసవన్న, వెంకటేశ్వర స్వామి, గోదాదేవి, హరిదాసు తదితర వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జామిరెడ్డి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోస్తని విద్యాపీఠ్‌లో

పద్మనాభం మండలంలోని గోస్తనీ విద్యాపీఠ్ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గంగిరెద్దుల వేషాలు, భోగి మంటలు వేశారు.

ములగాడ : స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో సంక్రాంతి పండుగను ఉత్సాహంగా నిర్వహించారు. సంబరాల్లో భాగంగా కళాశాల మొత్తం రంగవల్లులతో, రకరకాల అలంకరణలు చేశారు. భోగిమంటను వేశారు. రంగవల్లుల చుట్టూ విద్యార్థినులు, అధ్యాపకులు నృత్యం చేశారు. పండగ విశిష్టతను గురించి పలువురు అధ్యాపకులు వివరించారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ కేస్లిన్ మాట్లాడుతూ, సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు తీసుకెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

విశాఖకలెక్టరేట్: సంక్రాంతిని పురస్కరించు కొని విశాఖ కెజిహెచ్‌లో పలు విభాగాలకు చెందిన నర్సింగ్ సిబ్బందికి నర్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 14 విభాగాలకు చెందిన హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు పాల్గొని విభాగాల వారీగా రంగవల్లికలు వేశారు. కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద ఉద్యోగులు, సిబ్బంది వేసిన ముగ్గులను పరిశీలించారు. న్యాయ నిర్ణేతలుగా డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ వాసవిలత, డాక్టర్ వాణి, గ్రేట్ నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మౌళి వ్యవహరించారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారి పేర్లను డిసిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ మెహర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు భవాని, వరలక్ష్మి, సీనియర్ హెడ్ నర్సులు పిట్ట వరలక్ష్మి, డి.లక్ష్మి ప్రశాంతి పాల్గొన్నారు.

నక్కపల్లి : పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో బాల ఉద్యానవనం నుండి 5 వ తరగతి వరకూ విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన కేరింతలు కార్యక్రమం శనివారం సాయంత్రం ముగిసింది. సంక్రాంతి సంబరాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఆంధ్రప్రదేశ్ అధ్యయన కేంద్రం (సి ఏ పీ ఎస్)ప్రాజెక్ట్ సమన్వయకర్త వోలేటి సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు ఆశలు, ఆకాంక్షలు కలిగి వుండాలని సూచించారు.

శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం చదువుకి మాత్రమే పరిమితమైతే వారికి ఒత్తిడి పెరిగి మానసిక సంఘర్షణ కు లోనవుతారని తెలిపారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి అజయ్ ప్రకాష్, సీనియర్ ప్రిన్సిపల్ ఎమ్.వి.వి.ఎస్ మూర్తి, కన్వీనర్ టి.సంధ్యారాణి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ బి.అప్పారావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రంగ వల్లులు, భోగి మంటలు, భోగి పళ్ళు పోయుట, గాలిపటాలు ఎగరవేయడం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో అలరించారు. రాష్ట్ర కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జి, ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు, పెందుర్తి నియోజకవర్గ వైసీపీ నాయకులు గండి రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బివి అప్పారావు, శ్రీను, రమణ, మాజీ ఎంపీపీ గండి దేముడు, వైసీపీ యువజన విభాగం మండల అధ్యక్షులు యడ్ల నాయుడు, నాయుడు, శ్రీనివాసరావు, వాసు పాల్గొన్నారు.

అనకాపల్లి డైట్‌లో ...

గాజువాక గిరీష్ విద్యానికేతన్‌లో...

పరవాడ : గ్రేటర్ విశాఖ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెం, అగనంపూడి సమీపంలోని ఏబిఎస్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. మగపిల్లలు పంచె కట్టు భుజంపై కండువాతో, బాలికలు పట్టు పరికిణీలు ధరించి వాలు జడతో సందడి చేశారు. హరిదాసు డూడూ బసవన్నలు, భోగిమంటలు, రంగవల్లికలతో తెలుగు వెలుగులు పంచారు. పాఠశాల వ్యవస్థాపకుల పిఎం.కొండయ్య, తిరుపతమ్మ, ప్రిన్సిపల్ యు పద్మజ, డైరెక్టర్ యు దీపక్ పాల్గొన్నారు.

అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు సాంప్రదాయం ప్రతిబింబించేలా పిండి వంటలు తయారుచేయడం, గాలి పటం, ముగ్గులు వేయడం, పాట్ పెయింటింగ్, స్లో సైక్లింగ్, సాక్రేస్, భోగి మంటలు, గొబ్బిల్లు వంటి వివిధ పోటీలను నిర్వహించారు. గ్రామీణంలో ఇళ్ళు ఉట్టి పడేలా నమూనాలను తయారు చేయడం అందరిని ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ బోగి మంటలను వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.జె.గణేష్ ప్రసాద్ రెడ్డి, వివిధ విభాగాధిపతులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఈవెంట్ కో ఆర్డినేటర్ షెక్ షబీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

వైజాగ్ ఎక్స్‌పో 2025 ప్రారంభం

ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: కుటుంబం అంతటికి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే వేదికగా వైజాగ్ ఎక్స్ పో 2025 నిలుస్తుందని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు అన్నారు. శనివారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని సబ్ మెరైన్ మ్యూజియం ఎదురుగా ఏర్పాటు చేసిన వైజాగ్ ఎక్స్ పో 2025ను ప్రారంభించారు. కొండపల్లి బొమ్మలతో తయారుచేసిన ప్రధాన గేట్ ఎంతో ఆకర్షణీయంగా ఉందన్నారు. ఎగ్జిబిషన్లో ఏర్పాటు చేసిన వైవిధ్యమైన ఆట వస్తువులు, జలకన్యలు వంటివి చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరిని అలరిస్తాయని అన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ మాట్లాడుతూ, కాశ్మీర్ నగరాన్ని నమునాగా తీసుకొని ఇక్కడ ఏర్పాటు చేసిన విధానం ప్రజలందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు. గత 30 సంవత్సరాలుగా విశాఖ నగరంలో ప్రతీ సంవత్సరం సరికొత్త కాన్సెప్ట్ తో నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్ ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకుందని చెప్పారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజారెడ్డి మాట్లాడుతూ, ప్రజలందరికీ అందుబాటులో ఉండే ధరలో ప్రవేశ రుసుమును ఉంచామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బైరెడ్డి పోతన రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపీ కాలనీ: కైలాసగిరి పర్యాటక ప్రాంతంలో విఎంఆర్డిఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శనివారం ఉదయం ఆయన కైలాసగిరిలో సందర్శకులు, పర్యాటకులతో మాట్లాడి కల్పించాల్సిన వసతులు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని, సందర్శకుల సూచనల మేరకు పారిశుధ్యం మెరుగ్గా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. వ్యాపారులు ఎవరైనా నిర్దేశించిన రుసుములకంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయనతో పాటు జాయింట్ కమిషనర్ కె రమేష్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్